

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
8 పేజీలు | మంగళవారం | నవంబర్ 21, 2023 | www.navatelangana.com



సిరికొండను ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతా..

- బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్
- కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం

8లో...



ఇంద్రవెల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్ విస్తృత ప్రచారం

- వార సంతలో కూరగాయలు అమ్ముతూ ఓట్ల అభ్యర్థన
- గిరిజన గ్రామాల్లోనూ ప్రచారం

8లో...

కందికి రెబల్ రంది..!

- తిరుగుబాటు అభ్యర్థిగా బరిలో సంజీవ్‌రెడ్డి
- కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు గండిపడే అవకాశం
- ఆయన వైఖరిపై పార్టీ క్యాడర్‌లోనూ అసంతృప్తి
- ఎన్నికల ముంగిట కాంగ్రెస్ అభ్యర్థికి ఎదురీత



ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డికి రెబల్ రంది పట్టుకుంది. టికెట్ దక్కకపోవడంతో రెబల్ అభ్యర్థిగా బరిలో దిగిన సంజీవ్‌రెడ్డి కాంగ్రెస్ ఓట్లను భారీగా చీల్చే అవకాశం కనిపిస్తోంది. దీంతో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డికి సాంప్రదాయ కాంగ్రెస్ ఓట్లు దూరం కానున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోపక్క ఆయన వైఖరి పట్ల సొంత పార్టీలోనూ అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోపక్క ప్రత్యర్థులుగా బీఆర్ఎస్, బీజేపీ నుంచి బలమైన అభ్యర్థులు బరిలో ఉండటంతో ఈ ముక్కోణపు పోటీలో ఆయన నెగ్గుకు రాగలరా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాతపై ఆయన చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగడం.. అలాంటి వ్యాఖ్యలు సరికావని సొంత పార్టీ నేతలే బాహటంగా చెబుతుండటం చర్చనీయాంశంగా మారింది. దీనికి తోడు గ్రామాల్లో అనేక ఏండ్ల నుంచి ఉన్న పార్టీ ముఖ్య నాయకులను సైతం పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వివరాలు..2లో...

ప్రచారం జోరు.. వాహనాల హోరు..!

- గొంతు చించుకుంటున్న ప్రచార రథాలు
- పల్లెలు, గల్లీల్లో తిరుగుతూ హోరెత్తిస్తున్న వైనం
- ఆకట్టుకుంటున్న కళాకారుల ఆటపాట..డిజిటల్ స్క్రీన్‌లు
- గెలుపే లక్ష్యంగా వివిధ పార్టీల ప్రయత్నాలు

ఎన్నికల సందర్భంగా గత పదేండ్ల క్రితం అభ్యర్థులు ప్రచారం చేయాలంటే.. ఒక వాహనంలో గ్రామానికి వెళ్లి అక్కడి ప్రధాన కూడలిలో మైక్‌ను సెట్ చేసుకొని..ఊరందరికీ వినిపించేలా మాట్లాడేవారు. పాటలు కూడా అంతగా వినిపించేవి కావు..కానీ కాలం మారింది.. కొత్త టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ఇప్పుడు ప్రచారం చేయాలంటే ప్రచార రథాలకు పనిచెబుతున్నారు. అభ్యర్థుల కంటే ముందుగానే ఆయా గ్రామాలకు వెళ్లి పాటల రూపంలో ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నాయి. ఒక్కో అభ్యర్థి పదుల సంఖ్యలో వాహనాలను సమకూర్చుకోవడం..వాటిని పల్లెలు, గల్లీల్లో తిప్పుతూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఫలితంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పల్లెలు, పట్టణాలు సౌండ్లతో హోరెత్తిస్తున్నాయి. భారీ శబ్దాలతో జనానికి కొంత ఇబ్బందిగా మారుతున్నా..ఎన్నికల సీజన్ కావడంతో ఇలాంటివి సాధారణమేనని సర్దుకోవడం కనిపిస్తోంది. నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



వివరాలు..2లో...

పట్టాలిస్తే తెలంగాణలో ఉంటాం

- సరిహద్దు గ్రామాల చూపు తెలంగాణ వైపే
- మా ఊర్లను మహారాష్ట్ర నుంచి వేరు చేయండి
- ఉమ్మడి ఏపీ హైకోర్టు తీర్పు అమలు చేయాలని డిమాండ్



నవతెలంగాణ-కెరమెరి

ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు హక్కు పత్రాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, పట్టాలిచ్చి తమ గ్రామాలను తెలంగాణలోనే కలపాలని రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లోని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న వివాదాస్పద గ్రామాల ప్రజలు తెలంగాణలోనే ఉంటామని, 1996లో అప్పటి ఉమ్మడి ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తమను తెలంగాణలో కలపాలని డిమాండ్ చేస్తున్నారు. తమ గ్రామాలను మహారాష్ట్ర నుంచి వేరుచేసి తెలంగాణలో కలిపితే తమ బతుకులు బాగుపడుతాయని పేర్కొంటున్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సమయంలో మహారాష్ట్రలోని తెలుగు మాట్లాడే వారిని ఏపీలో కలుపగా.. ఇక్కడ మరాఠీ మాట్లాడే వారిని మహారాష్ట్రలో కలిపారు. ఆ సమయంలో ఇరురాష్ట్రాల మధ్య ఉన్న భూభాగంపై భౌగోళికంగా సరైన స్పష్టత ఏర్పడని కారణంగా ఇక్కడి 12 గ్రామాలు నేటికీ సమస్యాత్మక గ్రామాలుగానే మిగిలిపోయాయి. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తాము పూర్తిస్థాయిలో పొందుతున్నామని, తాము ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూములకు పట్టాలిస్తే తమ గ్రామాలను పూర్తిస్థాయిలో తెలంగాణలో కలిపితే తమకు భద్రత కలుగుతుందని వివిధ గ్రామాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 4242 మంది 12 గ్రామాల్లో నివసిస్తున్నారు. 20 శాతం గిరిజనులతో పాటు ఇతర సామాజిక వర్గాలు, 80శాతం దళిత, సామాజిక వర్గానికి చెందిన ప్రజలు నివసిస్తున్నారు. ఇటీవల గిరిజనులకు తెలంగాణ ప్రభుత్వం పోడు హక్కు పత్రాలు ఇవ్వడంతో తెలంగాణ వైపే మొగ్గు చూపుతున్నారు. దళిత సామాజిక వర్గాలకు సంబంధించిన రైతులకు గిరిజనుల లాగే తమ భూములకు హక్కు పత్రాలు ఇచ్చి తమను తెలంగాణ రాష్ట్రంలో విలీనం చేయాలని కోరుతున్నారు

ఇవే వివాదాస్పద గ్రామాలు..

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సమయంలో మహారాష్ట్ర సరిహద్దులోని 12 గ్రామాలు సమస్యాత్మక గ్రామాలుగా మిగిలిపోయాయి. ఇప్పుడు వాటి సంఖ్య 14కు చేరింది. పరందోలి, కోట,

మిగతా..2లో...

కందికి రెబల్ రంది..!

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ నుంచి తొలిసారి అసెంబ్లీ బరిలో నిలుస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డికి నియోజకవర్గంలో ప్రతికూల పవనాలు వీస్తున్నట్లు కనిపిస్తోంది. సీనియర్ నాయకులను కాదని..కాంగ్రెస్ టికెట్ తెచ్చుకున్న ఆయనకు పార్టీ క్యాడర్ పూర్తిస్థాయిలో సహకరించడం లేదని తెలుస్తోంది. అమెరికా నుంచి వచ్చిన ఆయన తొలుత బీజేపీలో చేరి సుమారు ఏడాది పాటు ఆ పార్టీలో పనిచేసిన ఆయన పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. కానీ అప్పటికే కాంగ్రెస్‌కు పెద్దదిక్కుగా ఉన్న గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్, సంజీవ్‌రెడ్డిలు టికెట్ ఆశించారు. తమ ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పనిచేస్తామని అధిష్టానం వద్ద చెబుతూ వచ్చారు. కానీ కాంగ్రెస్ అధిష్టానం మాత్రం కంది శ్రీనివాస్‌రెడ్డికే టికెట్ కేటాయించింది. అసంతృప్తికి గురైన సీనియర్ నాయకులు మూకుమ్మడిగా కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. సంజీవ్‌రెడ్డి ఎన్నికల బరిలో నిలవడంతో గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్‌లు ఆయనకు మద్దతుగా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో అసలు కాంగ్రెస్ వీరితోనే ఉందని..ఆ పార్టీ క్షేత్రస్థాయి కార్యకర్తలు, నాయకులు సంజీవ్‌రెడ్డి వెంట ఉన్నారు. నామినేషన్ సందర్భంగా ఆయన భారీ ర్యాలీ నిర్వహించడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తుందని చెబుతున్నారు. మిగితా వారు మాత్రం పార్టీ టికెట్ ఇచ్చిన వ్యక్తి కోసం పనిచేయాలనే ఉద్దేశంతో శ్రీనివాస్‌రెడ్డి వెంట ఉన్నారు. వారం రోజుల క్రితం శ్రీనివాస్‌రెడ్డి బేల మండలంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గండ్రత్ సుజాతపై తీవ్రమైన వ్యాఖ్యలు చేయడంతో సొంత పార్టీ కార్యకర్తల్లోనూ అసంతృప్తి వ్యక్తమైంది. సీనియర్ నాయకుల పట్ల అలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది.

ఎవరినీ ఖాతరు చేయడం లేదా..?

కాంగ్రెస్ టికెట్ దక్కించుకొని ప్రచారం ప్రారంభించిన కంది శ్రీనివాస్‌రెడ్డి ఆ పార్టీకి చెందిన క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని ప్రచారం జరుగుతోంది. గ్రామాల్లో ఏండ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. కనీసం వారితో పరిచయాలు సైతం కలిగి లేరని..ఆయన వద్దకు వచ్చే వారిని మాత్రమే చేరదీస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ పార్టీకి చెందిన గ్రామ స్థాయి కార్యకర్తల్లో అసంతృప్తి కనిపిస్తోంది. బూత్ స్థాయిలో ఓటర్లను పార్టీ వైపు ఆకర్షితులను చేయడంలో కీలకంగా వ్యవహరించే వారిని ఖాతరు చేయడం లేదనే ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిణామాల కారణంగా ఆయన వెంట చెప్పుకోదగిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎవరనే వాదన వినిపిస్తోంది.ఇలాంటి ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా బీఆర్ఎస్, బీజేపీ నుంచి బరిలో ఉన్న ప్రత్యర్థులు బలంగా ఉండటంతో వీరిని తట్టుకొని తాజా ఎన్నికల్లో నెగ్గుకు రాగలరా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రచారం జోరు..వాహనాల హోరు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రతి ఒక్కరికి ప్రచార రథం అనివార్యంగా మారింది. ఈ వాహనం లేకపోతే ప్రచారం చేయలేమనే పరిస్థితి వచ్చింది. దీంతో ఆయా ప్రధానపార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం ముందుగా వారి గుర్తులు, ముఖ్య నాయకుల బొమ్మలతో కూడిన ప్రచార రథాలను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు టికెట్లు ఖరారైన నాటి నుంచి వాటిని తిప్పుతుండగా.. స్వతంత్రులు గుర్తులు కేటాయించిన నాటి నుంచి వినియోగిస్తున్నారు. వీటిని నియోజకవర్గంలో తిప్పేందుకు రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) నుంచి అనుమతి తీసుకుంటున్నారు. తాజా ఎన్నికల్లో కేవలం ఆదిలాబాద్ నియోజకవర్గంలోనే 177వాహనాలకు అనుమతి తీసుకోగా.. ఎన్నికల అధికారులు 170 వాహనాలకు అనుమతిచ్చారు. ఇలా ఉమ్మడి జిల్లాను పరిగణనలోకి తీసుకుంటే పది అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు వెయ్యికి పైగా ప్రచార వాహనాలు ఆయా అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహిస్తుండటం గమనార్హం.

బండెనక బండితో తికమక..!

ప్రస్తుతం ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, డీఎస్పీలతో పాటు రిజిస్ట్రేషన్ కలిగిన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం ఈ ప్రచార రథాలను వినియోగిస్తున్నారు. ఆయా పార్టీలకు సంబంధించిన పాటలు..అభ్యర్థులు, గుర్తులను తెలిపే విధంగా పాటలు తయారుచేయించి ప్రజలల్లోకి తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా ఒక్కో పార్టీ పదుల సంఖ్యలో ఈ వాహనాలను తిప్పుతుండటంతో ఒకదాని వెంట మరో వాహనం పాటల రూపంలో ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఒక్కో కూడలిలో మూడు నుంచి నాలుగు వాహనాలు ఒకే దగ్గర నిలిపి ఉంచి పాటలు వినిపించడంతో ఏ పాట ఏ పార్టీ వారిదో అర్థం కాక జనాలు చెవులు కొరుక్కొంటున్నారు. ముఖ్యంగా పల్లెలకు వెళ్తున్న వాహనాలు సైతం ఆయా పార్టీలకు సంబంధించి పాటలు పెట్టుకుంటూ వెళ్లడంతో పొలం పనుల్లో నిమగ్నం అయ్యే వారు సైతం తికమకపడుతున్నారు. అందులో అర్థాలు వేరైనప్పటికీ.. ఒకే మాదిరి పాట వేర్వేరు పార్టీలది కావడంతో జనాలు సైతం ఆశ్చర్యానికి గురవుతున్నారు. మరోపక్క ఆయా పార్టీలకు సంబంధించి మేనిఫెస్టోలను వివరించేందుకు కళాకారులను సైతం రంగంలోకి దింపారు. వారి ఆటపాటల ద్వారా ఓటర్లను తమవైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని పార్టీలు డిజిటల్ స్క్రీల ద్వారానూ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ప్రధాన కూడళ్లలో డిజిటల్ స్క్రీన్ కలిగిన వాహనాలు నిలిపి ఉంచి ఆయా పార్టీల అభ్యర్థుల ప్రసంగాలను వినిపిస్తున్నారు. ఎన్నికల్లో గెలిపిస్తే చేపట్టబోయే పనులతో పాటు ప్రత్యర్థులపై విమర్శలు చేస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుండటం ఆసక్తి రేపుతోంది. జెండాలు వేరైనా గెలుపు ఎజెండాతో వెళ్తున్న పార్టీలు ప్రజలు ఆకర్షించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-నస్పూర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సీసీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 363 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కాసిపేటకు చెందిన బోడ శంకర్(39) సోమవారం జైపూర్‌లోని గురుకుల పాఠశాలలో కుమారున్ని వదిలి తిరిగి వస్తుండగా శ్రీరాంపూర్ సీహెచ్‌పీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా, సీసీసీ ఎస్ఐ రవికుమార్ ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

జన్నారం : మండలంలోని లోత్రాై, కలమడుగు, బంగారుతండా గిరిజన గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ కే.గోపాలకృష్ణన్ సోమవారం పరిశీలించారు. గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణరాణి, తహసీల్దార్ వేణుగోపాల్, ఈవోపీఆర్డీ రమేష్, ఆర్ఐ భానుచందర్ పాల్గొన్నారు.



పట్టాలిస్తే తెలంగాణలో ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

ముకుదంగూడ, లెండిజాల, శంకర్‌లొద్ది, బోలపటార్, అంతాపూర్, లెండిగూడ, ఏసాపూర్, ఇంద్రనగర్, గౌరి, పద్మావతి, మహారాజ్‌గూడ గ్రామాలు తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో ఉండిపోయాయి. ఈ గ్రామాల ప్రజలకు రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉంది. రెండు రాష్ట్రాలకు చెందిన రేషన్‌కార్డులతో పాటు ప్రభుత్వ పరంగా అమలు చేసే సంక్షేమ పథకాలను రెండు ప్రభుత్వాల నుంచి పొందుతున్నారు. 1976 నుంచి రెండు రాష్ట్రాలు ఈ గ్రామాలను కలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. 1982లో వివాదం తారాస్థాయికి చేరింది. 1983లో ఏపీ నుంచి ఈ ప్రాంతంలోని గిరిజనులకు పోడు భూములపై పహణీలను అందించారు. 1991లో రెవెన్యూ, అటవీ శాఖల ద్వారా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. 1996లో ఏపీ హైకోర్టు ఈ గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవిగా తీర్పునిచ్చింది. దీన్ని సవాలు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీంతో ఈ వివాదాస్పద గ్రామాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఇంకా ఈ వివాదం కొనసాగుతూనే ఉంది.

అన్ని డబుల్ ధమాకే..

వివాదాస్పద గ్రామాల అంశం సుప్రీంకోర్టులో ఉండడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం అయ్యే వరకు ఇరు రాష్ట్రాల సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోర్టు ఆదేశించింది. అప్పటి నుండి తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మీ, ఒంటరి మహిళలకు పింఛన్లు, ఉచిత రేషన్ బియ్యం, విద్య వైద్యంతో పాటు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందుతోంది. రెండు రేషన్ కార్డులు, రెండు ఓటర్ గుర్తింపు కార్డులు, తెలంగాణ రాష్ట్రం తెలుగు మీడియం ప్రభుత్వ పాఠశాలలు, మహారాష్ట్ర ప్రభుత్వం మరాఠీ పాఠశాలల్లో విద్యార్థులు చదువుతున్నారు. రెండు రాష్ట్రాల నుండి సంక్షేమ పథకాలు అమలవుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం తరపున అధికాలు సరిహద్దు గ్రామాలను సందర్శించిన సందర్భంలో తెలంగాణ వైపే ఉంటామని, మహారాష్ట్ర ప్రభుత్వం నుండి తరపున సందర్శించిన అధికారులతో మహారాష్ట్ర వైపే ఉంటామని సరిహద్దు గ్రామాలకు చెందిన కొంత మంది ప్రజలు చెప్పడం కొసమెరుపు.

పట్టాలు లేక ఇబ్బందులు

సరిహద్దు గ్రామాల్లోని రైతులు రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలకు దూరమవుతున్నారు. ఏడాదికి రెండు దఫాలుగా అందిస్తున్న రైతుబంధుతో రైతులకు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి తప్పింది. రైతుల కోసం ప్రవేశపెట్టిన ఈ పథకాలతో సరిహద్దు గ్రామాల రైతులు తెలంగాణలో తమ గ్రామాలను విలీనం చేయాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రెండు గ్రామ పంచాయతీలను నాలుగు గ్రామ పంచాయతీలు చేయగా సరిహద్దు గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయి. తమ భూములకు పట్టాలిచ్చి 12 వివాదాస్పద గ్రామాలను మహారాష్ట్ర నుంచి వేరు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కరెంట్ కష్టాలు తీరాయి : సంతోష్, పరందోలితండా



మహారాష్ట్ర ప్రభుత్వం అందించే కరెంట్ సక్రమంగా అందించక పోగా అంధకారంలో రోజులు గడిపే వాళ్లం. తెలంగాణ రాష్ట్రం అందిస్తున్న కరెంట్ 24గంటలు ఉంటుంది. దీంతో సరిహద్దు గ్రామాలు రాత్రి పూట వెలుతురులో వెలిగిపోతున్నాయి. నీటి సౌకర్యం ఉన్న రైతులు మూడు కాలాలు పంటలు సాగు చేస్తున్నారు.



పట్టాలిస్తే రైతులు మరింత అభివృద్ధి : రాథోడ్ గుణవంత్‌రావు, ఉప సర్పంచ్ పరందోలి

భూములకు హక్కు పత్రాలు లేక రైతు సంక్షేమ పథకాలకు దురమవుతున్నాం. ఇటీవల గిరిజనులకు పోడు హక్కు పత్రాలు ఇచ్చినట్లే మిగతా సామాజిక వర్గాల రైతులకు కూడా హక్కు పత్రాలు అందించాలి. దీంతో రైతు సంక్షేమ పథకాలు మాకు అందుతాయి. మేము ఆర్థికంగా అభివృద్ధి చెందుతాం. పట్టాలిచ్చి మా గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలి.

3
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిర్మల్
మంగళవారం నవంబర్ 21, 2023

జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల ప్రచారంలో భాగంగా గుల్జార్ మార్కెట్, ఇస్లాంపూర్, బంగల్ పేట్‌తో పాటు పలు వార్డుల్లో సోమవారం మున్సిపల్ చైర్మెన్ గంగ్రత్ ఈశ్వర్ ప్రచారం చేశారు. ఆయా వార్డుల్లో స్థానిక నాయకులతో కలిసి తిరుగుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ, పథకాలను గుర్చి ప్రజలకు వివరిస్తూ, నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, ప్రజలను అభ్యర్థించారు. ఆసరా పింఛన్, షాదీముబారక్, కళ్యాణలక్ష్మీ, పలు అంశాలపై ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందని అన్నారు. మూడోసారి ఇంద్రన్న హ్యాట్రిక్ విజయం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-కడెం

గుడుంబాను తయారు చేసిన విక్రయించిన కఠిన చర్యలు తప్పవని నిర్మల్ ఎక్సైజ్ సీఐ సీహెచ్ సంపత్ కృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో లక్ష్మీ సాగర్‌తండ, కొత్త మద్దిపడగ, గంగాపూర్ గ్రామాల్లో ముగ్గురి వద్ద సుమారు ఇరవై లీటర్ల నిషేధిత గుడుంబా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. గుడుంబా తయారుకై సిద్ధంగా ప్లాస్టిక్ డ్రమ్ముల్లో పులియబెట్టిన బెల్లం పానకం, బాత్ రూం, పంట పొలాల్లో సుమారు ఆరు వందల లీటర్లు కనుగొని, ధ్వంసం చేసి ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్టు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై మాట్లాడుతూ మండలం పరిధిలో నిషేధిత ఎండు గంజాయి, గంజాయి సేద్యం, గుడుంబా తయారీ, తయారీ పదార్థాలైన బెల్లం, పటిక సమాచారం ఎక్సైజ్ స్టేషన్ నిర్మల్‌లో తెలియజేసి సహకరించాలని కోరారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది నరేందర్, ముత్యం, సాయి, హరీష్ పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్



ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా ఎన్నిల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం స్థానిక కొండాపూర్ సెయింట్ థామస్ స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. దాదాపు అరగంట సేపు వాహనాలను దగ్గరుండి తనిఖీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్ట్ వద్ద ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి మద్యం, నగదు, మాదక ద్రవ్యాలు సరఫరా కాకుండా చూడాలని, విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం మంజులాపూర్‌లోని ఎస్సీ కాలనీలో పంపిణీ చేస్తున్న ఓటరు స్లిప్పులను పరిశీలించి, సంబంధిత బీఎల్ఓను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటరు స్లిప్పులు త్వరగా పూర్తి చేయాలని, ఓటర్ స్లిప్పులు ప్రతి ఓటరుకు అందేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ సీవీ రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

40వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని గత కొన్ని రోజుల నుంచి గ్రామస్తుల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంతో 40వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పల్సి మండల కేంద్రం ఏర్పాటు చేయడానికి అన్ని అర్హతలు ఉన్న పల్సిని మండలంగా ఏర్పాటు చేయక పోవడం చాలా బాధాకరంగా ఉందని అన్నారు. ఎలాంటి అర్హత లేకున్న మండలంగా ఏర్పాటు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. దీంతో మండలం ఏర్పాటు చేయాలని గతంలోనే మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానాలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. మండలం ఏర్పాటు చేసేంత వరకు ఈ దీక్షలు కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు ఉన్నారు.

యాసంగి పంటకు కడెం నీటిని విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ దుర్గం నూతన్ కుమార్

నవతెలంగాణ-నిర్మల్

యాసంగి పంటకు కడెం నీటిని విడుదల చేయాలని, ప్రజా సంఘాల పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ దుర్గం నూతన్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కడెం నీటిని యాసంగి పంటకు విడుదల చేసే పరిస్థితులు కనబడుటలేదన్నారు. కడం ప్రాజెక్టుకు ఉన్నటువంటి ఒక గేటు తెగిపోవడంతో ప్రాజెక్టులో ఉన్నటువంటి నీరు బయటకు వెళ్లిపోతుందని అన్నారు. కడెం ప్రాజెక్టు ఖాళీ అయిందన్నారు. మరమ్మతులు చేయాలన్న సాకుతో కడెం యాసంగి పంటకు నీళ్ల వదిలే పరిస్థితి లేదని అన్నారు. నీరు ఇవ్వకపోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రాజెక్టు గేటును మరమ్మతు చేసి శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి కడం ప్రాజెక్టును నింపి, జనవరి ఒకటి తారీకు కల్లా నీటిని విడుదల చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తోడసం శంభు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.సత్యనారాయణ, చందుల సాయికిరణ్, కాతిలే లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే గిరిజన గ్రామాలాభివృద్ధి

● మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నవతెలంగాణ-సారంగాపూర్

బీఆర్ఎస్ పాలనలోనే గిరిజన గ్రామాలాభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సోనాపూర్ తండా, గోపాలపేట తండా, రాజరాజేశ్వర తండా, గోపాల్‌పేట్, సాయినగర్ తండా, పలు గ్రామాల్లో జోరుగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో పాలించిన కాంగ్రెస్ అభివృద్ధి చేసిందేమీ లేదని, బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ప్రజలు గుర్తుకు వస్తారన్నారు.



బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

బీఆర్ఎస్ పాలనలో నిర్మల్ జిల్లా కేంద్రమైందని అన్నారు. మెడికల్ కాలేజ్ ఏర్పాటై అన్ని రంగాల్లో దూసుకుపోతోందని అన్నారు. బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి 2009 నుంచి 2014 వరకు అధికార కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నిర్మల్‌ను కొంచమైనా అభివృద్ధి చేసిండా అని ప్రశ్నించారు. నిర్మల్‌లో ఇంజనీరింగ్ కాలేజ్‌ను హైదరాబాద్‌కు తరలించి అమ్ముకున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మాధవరావు, అడెల్లి పోచమ్మ చైర్మెన్ ఐయిటి చందు, ఏఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రితశ్రీనివాస్‌రెడ్డి, మాజీ చైర్మెన్ రాజ్ మహమ్మద్, సొసైటీ వైస్ చైర్మెన్ లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ రాధ భూమేష్, నాయకులు, శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలి



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కడెం

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫీక్ అహ్మద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పెద్దూర్, తండా, కొలంగూడలో బీఆర్ఎస్ నాయకులు గడప గడప ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ గెలిపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్తలు పని చేయాలని అన్నారు. ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ మేనిఫెస్టోను, సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడెం సర్పంచ్ కొండాపురం అనూష-లక్ష్మణ్, మండల కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే హైమద్, ఖానాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయిని మంగ, బీఆర్ఎస్ పార్టీ కడెం మండల ప్రచార కార్యదర్శి ముబారక్ బీన్ మొహమ్మద్, కడెం టౌన్ అధ్యక్షులు కే.రవి, పార్టీ సీనియర్ నాయకులు చిట్టెటి ముత్తన్న, సపవత్ రవి, గౌసొద్దీన్, ఎండీ కలీం, ఎండీ హసీబ్, బోర్లకుంట రాజేష్, కత్తర్‌పాక శేఖర్, వేణు నాయక్, భూక్యా శేఖర్, గంగన్న, జాడి నర్సయ్య, సయ్యద్ షకీల్, సయ్యద్ నుస్రత్, ఆర్ల రాజేశ్వరి, కరుణ, ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో అన్ని వర్గాలకు ఉపయోగం



నవతెలంగాణ-తాంసి

కాంగ్రెస్ పార్టీ ఆరు సూత్రాలతో ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అన్ని వర్గాల వారికి ఎంతో ఉపయోగపడేలా ఉందని ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కౌడాల నారాయణ అన్నారు. సోమవారం మండలంలోని గిరిగామ, ఆట్నంగూడ గ్రామాల్లో నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి పేదలకు అందించిందన్నారు. అధికారంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేక పోయాయని, మరోసారి ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ అభ్యర్థిని ఆడే గజెందర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిషన్, రామన్న యాదవ్, కన్వీనర్ వెంకట్ రెడ్డి, గంగారెడ్డి, రామ్ రెడ్డి, రాకేష్ యాదవ్ పాల్గొన్నారు.

బాలలు వారి హక్కుల గురించి తెలిసి ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బాలలు వారి హక్కుల గురించి తెలిసి ఉండాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు దశరథ్, సమిరుల్లా ఖాన్ అన్నారు. సోమవారం మండలంలోని అంకోలి ఉన్నత పాఠశాలలో బాలలందరికీ అన్ని హక్కులు అందాలి అనే అంశంపై మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. బాలలపై లైంగిక నేరాల నుండి కాపాడే పోక్సో చట్టం వరకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీపీఓ రాజేంద్రప్రసాద్, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ సతీష్, మహిత ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ రావు, పాఠశాల హెచ్ఎం కంటే నరసయ్య, ఉపాధ్యాయులు అశోక్, నాందేవ్, మండల కోఆర్డినేటర్ ఆదర్శ్, సిబ్బంది సంఘ రత్న, భాగ్యశ్రీ, రాజేందర్, సుప్రియ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సమీరుల్లా ఖాన్

కాంగ్రెస్ అభ్యర్థి గజేందర్ ముమ్మర ప్రచారం

నవతెలంగాణ- ఇచ్చోడ



బోథ్ కాంగ్రెస్ అభ్యర్థి అడె గజేందర్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం ఇచ్చోడ మండలంలోని హీరాపూర్, దాబ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకండ్లలో చూడటానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని తెలిపారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగుల కోసం 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీనిచ్చారు. అలాగే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. వచ్చే నెల నుంచి రూ.4వేల పింఛన్లను అందిస్తామని భరోసా ఇచ్చారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే బోథ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు మహమూద్‌ఖాన్, మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు ముస్తఫా, బాబా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను గెలిపించాలి



తాంసిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు అశోక్

నవతెలంగాణ-తాంసి

అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను మూడోసారి గెలిపించాలని ఆ పార్టీ నాయకులు డా. వన్నెల అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని పొన్నారిలో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ తరపు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు మేనిఫెస్టోను వివరించారు. గ్రామంలో తిరుగుతూ ప్రజలను కలుస్తు ప్రచారం నిర్వహించారు. హోటల్‌లో బజ్జీలు వేస్తూ ఓటర్లను ఆకర్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మవద్దన్నారు. తెలంగాణ అభివృద్ధి కావాలంటే కేసీఆర్ నాయకత్వం వల్లనే సాధ్యమన్నారు. రైతులకు ఉచిత విద్యుత్తు, రైతు బీమా నిరుపేదలకు పెన్షన్ వంటి పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. మూడోసారి అధికారంలోకి రావాలంటే అనిల్ యాదవ్‌ను ఓటేసీ గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక్, కన్వీనర్ అరుణ్, జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, మండల నాయకులు శ్రీధర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రఘు, లింగారెడ్డి, రమణ, రాజబలి కేశవరెడ్డి, క్రిష్ణ రెడ్డి పాల్గొన్నారు.

తలమడుగు : మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ తరపున ఆ పార్టీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంతో పాటు సుంకిడి, దేవాపూర్, భరంపూర్ గ్రామాల్లో నాయకులు విస్తృతంగా పర్యటిస్తు కారుగుర్తుకు ఓటేయ్యాలని కోరారు. ఇంటింటికి తిరుగుతూ పార్టీ మేనిఫెస్టోతో పాటు మూడోసారి అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలను వివరించారు. పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళాలు, బీడీ కార్మికులతో పాటు రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసిందని తెలిపారు. ఈ సారి కూడా ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించాలని కోరారు. తొలిసారిగా బోథ్ నియోజకవర్గం నుంచి అనిల్ జాదవ్ పోటీ చేస్తున్నారని, ఆశీర్వాదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాటపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్, రాములు, షర్ఫుద్దీన్, ఉద్దావు, శంకర్, అడెల్లు, ఆశన్న, మల్లేష్, శివన్న, దేవన్న పాల్గొన్నారు.



తలమడుగులో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్‌తోనే సమస్యల పరిష్కారం



నవతెలంగాణ-నార్నూర్

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాల అమలుతో పాటు సమస్యలు పరిష్కారం అవుతుందని అన్నాభావు సాఠే మనుమడు సచిన్ సాఠే అన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోవ లక్ష్మి తరపున ఆయన సోమవారం మాలేపూర్ గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సమస్యలు పరిష్కారం కావాలంటే రాష్ట్రం, నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలన్నారు. కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రూపవతి న్యానోబా పుష్కర్, అన్నాభావు సాఠే జిల్లా నాయకులు ఉద్ధవ్ కాంబ్లె, పార్టీ సీనియర్ నాయకులు షేక్ దాదే అలీ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖసీం, నాయకులు సుల్తాన్ ఖాన్, మహాదేవ్ కేంద్రే, గ్రామ సర్పంచ్ పవార్ ఇందల్, సర్పంచ్ బాపూరావు మేట్టే, జాడే దయానంద్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని చూస్తే ఖబడ్దార్

• ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల హెచ్చరిక



విలేకరుల సమావేశంలో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు హెచ్చరించారు. సోమవారం మాదిగ ఉప కులాల సమిష్టి సంఘాల ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమాన వాట పంపిణీ కోసం మాదిగ ఉప కులాలు చేస్తున్న న్యాయబద్ధమైన ఎస్సీ వర్గీకరణ పోరాటం చివరి అంతిమ దశకు చేరుకుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంశాఖ మంత్రి అమిత్ షా అనుకూల ప్రకటనలు చేసినంతరం కొంత మంది స్వార్థపరులు అడ్డుకోవడానికి యత్నిస్తున్నారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని ఓ సామాజిక వర్గానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల నియమావళిని సైతం పట్టించుకోకుండా వ్యవహరించిన తీరుపై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇకపై ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడే నాయకులకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మల్యాల మనోజ్, మోతే బారిక్‌రావు, గోతిముక్కుల మధుకర్, కడదరపు ప్రవీణ్, నక్క రాందాస్, అరికెళ్ల అశోక్, సుంకే రమేష్, లింగంపల్లి ప్రసన్న కుమార్, బరుకుంట సుభాష్, గోధుమల అనిల్, పాల్గొన్నారు.

చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్కిల్ స్కాం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకి హైకోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయడం పట్ల ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. సోమవారం ఎన్టీఆర్ చౌక్ వద్ద టపాసులు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపి ప్రభుత్వం టీడీపీ నాయకులపై కక్షపూరితంగా వ్యవహరిస్తుందనీ, న్యాయమే గెలిచిందని ఆ పార్టీ నాయకులు అన్నారు. కార్యక్రమంలో రాజరెడ్డి, ఎండి రఫీక్, నాగన్న పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయంలో సంబరాలు

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు బాబు బెయిల్‌పై సంబరాలు జరుపుకున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కేసులో రెగ్యులర్ బెల్ మంజూరైన సందర్భంగా స్థానికులకు మిఠాయిలు పంచి నినాదాలు చేశారు. ఏపీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన చివరికి న్యాయ స్థానంలో తమకు ఉరట లభించిందన్నారు. బెయిల్ వచ్చిన విధంగానే రేపు కూడా నిర్దోశిగా అధినేత చంద్రబాబు బయటకు వస్తారని ధీమావ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శి ఆకుల రాము, పార్లమెంట్ కార్యదర్శి గంగసారపు ఓమన్న, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పరిహార ప్రభాకర్, మండల నాయకులు ఆరె రాజన్న, కే నరేందర్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆశాల పాత్ర కీలకం

నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లో ఆశావర్కర్ల పాత్ర కీలకమని పీహెచ్‌సీ వైద్యులు డా.రాంబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రం పీహెచ్‌సీలో టీబీ పరీక్ష క్యాంపు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 82 మంది టీబీ అనుమానిత లక్షణాలు ఉన్న వారికి శాంపుల్స్ సేకరించి ఉట్నూర్‌కు పంపించామని ఆయన తెలిపారు. లక్షణాలున్న వారు వెంటనే తేమడ పరీక్షలు చేసుకోవాలని, వ్యాధిని ముందస్తుగా గుర్తించి చికిత్సలు పొందాలని సూచించారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లోని ఇంటింటికి తిరుగుతూ అనుమానితులను గుర్తించాలన్నారు. వ్యాధి మొదటి దశలో గుర్తిస్తే త్వరగా కొలుకోవచ్చని తెలిపారు. ఎలాంటి సందేహాలున్న వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ శిబిరంలో సీహెచ్ఓ లక్ష్మి, హెచ్ఈఓ నాందేవ్, హెల్త్ సూపర్ వైజర్లు చౌహాన్ చరణ్ దాస్, సత్తవ్వ, వైద్య సిబ్బంది మిర్జ, సుశీల, బాపూరావ్, ఆశాలు గుంపాబాయి, మోతుబాయి, అనిత, లక్ష్మి, అరుణ, శ్రీలత, బొజ్జుబాయి, సరిత ఉన్నారు.

ప్రచారానికి దూరంగా రవీందర్‌రావు

● పార్టీ ప్రచారంపై నిరాసక్తి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్‌లో సీనియర్ నాయకునిగా పేరున్న పైడిపెల్లి రవీందర్‌రావు ఈ సారి ఎన్నికల ప్రచారంపై అంతగా ఆసక్తి కనబర్చకపోవడంతో పాటు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. దీంతో ఖానాపూర్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. గతంలో కాంగ్రెస్ హయంలో డీసీసీగా, ఏపీపీఎస్సీ సభ్యునిగా ఆయన పనిచేశారు. స్థానికంగా బలమైన నాయకునిగా పేరుపొందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రవీందర్‌రావు ఆపార్టీలో చేరారు. అప్పటి నుంచి ఆయన అనుచరులంతా బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నారు. 2018 ఎన్నికల తర్వాత ఎమ్మెల్యే రేఖానాయక్‌తో ఏర్పడిన విభేదాల కారణంగా రవీందర్‌రావుతో పాటు ఆయన అనుచరులంతా ఐదేండ్లుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఈ క్రమంలో రవీందర్‌రావు ప్రజలకు అందుబాటులో ఉండరన్న అపవాదును ఎదుర్కొంటున్నారు.

ఆయన అనుచరులు సైతం స్థానిక సమస్యలను పట్టించుకోకపోవడంతో లేదనే విమర్శలు ఉన్నాయి. అయితే ఈసారి ఖానాపూర్‌లో బీఆర్ఎస్ టికెట్‌ను రేఖానాయక్‌కు కాకుండా కేటీఆర్ మిత్రుడు జాన్సన్ నాయక్‌కు ఇచ్చారు. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్‌కు రవీందర్‌రావు వర్గమంతా పూర్తి స్థాయిలో పనిచేస్తుందని అందరూ అనుకున్నారు. అంతర్గతంగా ఏం జరిగిందో తెలియదు కాని రవీందర్‌రావు అనుచరులు అంతగా ఆసక్తిని చూపడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న పైడిపెల్లి రవీందర్‌రావు (ఫైల్)

సీనియర్, జూనియర్‌ల మధ్య గ్రూప్ విభేదాలు..

రవీందర్‌రావు గ్రూప్‌లో రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న నాయకులు ఉన్నారు. అధిష్టానం సూచనమేరకు ప్రతిసారి ఎన్నిల్లో వీరంతా కలిసి పనిచేసేవారు. వీరంతా పార్టీలో కార్యకర్తలుగా కొనసాగుతున్నప్పటికీ కొన్నేండ్లుగా ప్రజలతో, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ప్రతి సారి ఎన్నికల సమయంలో మాత్రమే తెరపైకి వచ్చే రవీందర్‌రావు గ్రూప్‌పై పార్టీలోని మెజార్టీ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే రవీందర్‌రావు గ్రూప్ ఎన్నికల ప్రచారంలో నామమాత్రంగానే పాల్గొంటున్నటు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

● ముధోల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణరావు పటేల్



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరావు పటేల్

నవతెలంగాణ-కుభీర్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి భోస్లే నారాయణరావు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని గోడిసెర, చోండి, పల్సి తండా తదితర గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో నారాయణరావు పటేల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం పక్కా అని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ముందుగా రైతులకు రూ.2లక్షల రైతు రుణమాఫీ పైన తొలి సంతకం పెడుతుందని అన్నారు. అదే విధంగా రైతుబంధు రూ.16వేలకు పెంచి రైతులకు భరోసా కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. మహిళలకు గృహలక్ష్మీ కింద నెలకు రూ.2వేల 500 వంట గ్యాస్‌కు రూ.500లకు అందించి, పేద మధ్య తరగతి ప్రజలకు అండగా ఉంటామని అన్నారు. దీంతో ఈనెల 30న ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెల్పించాలన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు గడుస్తున్నా ముధోల్ నియోజకవర్గాన్ని ఎలాంటి అభివృద్ధి పర్చారని కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బంక బాబు, జైరాం, జావిద్‌ఖాన్, విలాస్, ఆయా గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

యాదవ కుర్మల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ- ఆదిలాబాద్‌అర్బన్

బీసీల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన యాదవ కుర్మల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యేకు ఆ సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యాదవ, కుర్మల కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల తీరును వివరించారు. యాదవ కుర్మల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష ప్రాధాన్యతను కల్పిస్తోందని అన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అనివార్య కారణాలతో పథకాల ఫలాలు అందడంలో కొంత ఆలస్యం జరిగినప్పటికీ పూర్తిస్థాయిలో వాటిని అందజేసే బాధ్యత తమదేనని భరోసా కల్పించారు. ప్రతిపక్షాల



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

బూటకపు హామీలను నమ్మొద్దని హితవు పలికారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజా రెడ్డి, యాదవ సంఘం నాయకులు, డాక్టర్ రవికిరణ్ యాదవ్, వేణుగోపాల్ యాదవ్, పరమేశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.

బాలలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాలలు తమకు కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారిణి(డీడబ్ల్యూఓ) సావిత్రి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన బాలల హక్కుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలే దేశ సంపదని, వారి హక్కులను వారికి తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పని ప్రదేశాలలో ఉండకూడదని, వారి బాల్యం విద్యాలయాల్లో గడవాలని రాజ్యాంగం హక్కులు కల్పించిందన్నారు. హక్కులను బాలలకు తెలియచేయడంతో పాటు వాటి పరిరక్షణకు కృషి చేయాలన్నారు. హక్కులకు ఆటంకం కలిగితే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కి ఫోన్ చేయాలన్నారు. అనంతరం మహిళా సాధికారికత కేంద్రం డీఎంసీ శారద మాట్లాడుతూ విద్యార్థులు వారి హక్కులను తెలుసుకోవడం చాలా అవసరమన్నారు. బై స్టాండర్ ఇంటర్ వెన్షన్, చైల్డ్ మ్యారేజ్, విద్య ప్రాముఖ్యత, హెల్త్ న్యూట్రిషన్ గురించి తెలుసుకోవాలన్నారు. జెండర్ స్పెషలిస్ట్ రాణి మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావో, జెండర్ డిస్క్రిమినేషన్, జెండర్ ఇక్వాలిటీ, పోక్సో యాక్ట్, సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్ గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్సియల్ లీటరసీ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో పదేండ్ల జైలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

చింతలమానేపల్లి మండలానికి చెందిన మహిళపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలుతో పాటు రూ. 20వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా స్టేషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి రమేష్ తీర్పు ఇచ్చినట్టు లైజనింగ్ అధికారి కే.సాగర్, కాగజ్ నగర్ సబ్ డివిజనల్ లైజనింగ్ అధికారి బాబాజీ తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో జరిగిన అత్యాచారం ఘటనలో దుర్గం తేజస్ అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణ అనంతరం సాక్ష్యాదారాలతో ఛార్జిషీట్ దాఖలు చేసి, సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్ మోహన్ రావు నేరాన్ని రుజువు చేయడంతో నిందితుడికి 376(2), 417, 420 ఐపీసీ సెక్షన్ల కింద 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించినట్టు పేర్కొన్నారు.

ఈవీఎంల భద్రత పనితీరుపై అవగాహన

నవతెలంగాణ-తాండూర్

ఈవీఎంల భద్రత, పనితీరుపై బెల్లంపల్లి నియోజకవర్గ సెక్టోరల్ రిటర్నింగ్ అధికారులకు ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ రాహుల్ అవగాహన కల్పించారు. సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించి పలు విషయాలను తెలియజేశారు. ఎన్నికల రోజు పోలింగ్ ఏజెంట్లకు ఈవీఎంల పనితీరు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల అనంతరం ఈవీఎంలను సరియైన రీతిలో భద్రపరిచి కార్యాలయానికి చేరవేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

నవతెలంగాణ-లక్షెట్టిపేట

బస్సులో ప్రయాణికుడు మరిచిపోయిన బంగారాన్ని అందించి నిజాతీ చాటుకున్నాడు ఆర్టీసీ సిబ్బంది. సోమవారం లక్షెట్టిపేట బస్టాండ్‌లో ప్రయాణికుడు ఐదు తులాల బంగారాన్ని మరిచిపోయాడు. ఈ సమయంలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ గైడ్‌లు రవీందర్, ఆర్. మోహన్‌లకు బంగారం దొరింది. అప్పటికే బాదితుడు వెతుకుంటు అక్కడి చేరుకున్నాడు. తమకు దొరికిన బంగారాన్ని తనికి అప్పగించి వారి నిజాయితీని చాటుకున్నారు. ఆర్టీసీ సిబ్బందిని ఆ ప్రయాణికుడు పూలమాలలు వేసి శాలువతో సత్కరించి ధన్యవాదలు తెలిపాడు.

మైక్రో అబ్జర్వర్స్ ప్రక్రియ పూర్తి

నవతెలంగాణ-నిర్మల్

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి, మైక్రో అబ్జర్వర్స్ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సోమవారం సాధారణ పరిశీలకులు రవి రంజన్ కుమార్, విక్రమ్, కే. గోపాలకృష్ణ, ఆదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌ల సమక్షంలో జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల మైక్రో అబ్జర్వర్స్ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ప్రక్రియ పూర్తి చేసి స్క్రీన్ ద్వారా చూపించారు. జిల్లాలో మూడు నియోజకవర్గాలు నిర్మల్-47, ముధోల్-50, ఖానాపూర్-58 నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించేందుకు 155 మైక్రో అబ్జర్వర్స్‌ను కేటాయించామని అన్నారు. వీరికి త్వరలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్, ఈడీఎం నదీమ్, ఎన్ఐసీ ఇంజనీర్స్ మణికంఠ, మీర్జా, సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం నవంబర్, 21 2023

సంతలో ఎన్నికల ప్రచార సందడి

నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని వారసంతలో సోమవారం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల నాయకులు, కార్యకర్తలు వేరువేరుగా ప్రచారం చేయడంతో సంతలో సందడి నెలకొంది. మూడు పార్టీలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు మైకులతో హోరెత్తించారు. ఎలాంటి గొడవలకు తావివ్వకుండా సీఐ సాదిక్‌పాషా, ఎస్సై మధూకర్ ఆధ్వర్యంలో మూడు పార్టీలు గొడవలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ప్రక్కప్రక్కనే పాటలతో నృత్యాలు చేస్తూ కవ్వింపులకు పాల్పడ్డారు. ఆయా పార్టీలు సమన్వయం పాటించేలా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. సంతలో ఇరు పార్టీల మైకుల మోతకు సంతకు వచ్చిన వారు సౌండ్ భరించలేకపోయారు. ఏ పార్టీకి సంబంధించిన పాటలపై ఆ పార్టీ వారు నృత్యాలు చేయడంతో ఎవరికి అర్థంకాని పరిస్థితి నెలకొంది. తమతమ బలాలను చూపించేందుకు ఆయా పార్టీల నాయకులు పెద్దఎత్తున కార్యకర్తలతో కలిసి ర్యాలీలు సైతం నిర్వహించారు.

బైక్‌పై తరలిస్తున్న గంజాయి పట్టివేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మహారాష్ట్ర నుండి నజ్రూల్ నగర్ విలేజ్ నెంబర్ 9కి తరలిస్తున్న గంజాయిని సోమవారం పట్టుకున్నట్టు టాస్క్ ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి జిల్లాలోని వివిధ మండలాలకు గంజాయి విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఎస్సై సందీప్ కుమార్ సిబ్బందితో కలిసి ఈజ్‌గాం రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న రెండు బైక్ లమీద ఉన్న ముగ్గురు వ్యక్తులను ఆపి వారి వద్ద ఉన్న రెండు బ్యాగుల్లో తనిఖీ చేయగా 1.4 కిలోల గంజాయి లభ్యమైంది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని సీఐ తెలిపారు. నింధితులను విచారించగా నజ్రూల్ నగర్ విలేజ్ నెంబర్ 9కు చెందిన ఒక మైనర్, కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఇద్దరు మైనర్ యువకులు కలిసి మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకొచ్చి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో తక్కువ ధరకు మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నారు. గంజాయితోపాటు రెండు ద్విచక్ర వాహనాలు, రెండు మొబైల్ ఫోన్లను ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ సీఐ రణా ప్రతాప్, ఎస్సై సందీప్ కుమార్, పీసీలు రమేష్, మధు, ఎక్సైజ్ కానిస్టేబుల్ కేనారం మండల్ పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యం తీరుకు విద్యార్థుల నిరసన

- ఫీజులు చెల్లించాలంటూ తీవ్ర ఒత్తిడి
- కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఫీజులు చెల్లించాల్సిందే అని పట్టుబట్టిన కళాశాల యాజమాన్యాన్ని సౌకర్యాలపై విద్యార్థులు ప్రశ్నిస్తే తమకు సంబంధంలేదంటూ ఫీజుల కోసం పీడించిన ఘటన సోమవారం పట్టణంలోని వసుంధర డిగ్రీ కళాశాలలో చోటు చేసుకుంది. కళాశాల ప్రిన్సిపాల్‌ని సస్పెండ్ చేయాలని విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడే భీమేష్ పాల్గొని మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులని ఫీజులు కట్టాలంటూ గత వారం పది రోజుల నుంచి విద్యార్థులను వేధిస్తున్నారు. బస్ ఫీజు, కాలేజ్ ఫీజు కట్టకపోతే మీరు కాలేజీకి రావద్దు వస్తే టీసీలు రాసిస్తా వెళ్లిపోండి అని బాధ్యత రహితంగా విద్యార్థులతో మాట్లాడి మీరు ఏమన్నా చేసుకోండి అన్నారని వాపోయారు. ఇద్దరు లెక్చరర్లు అసభ్యకర పదజాలంతో మాట్లాడుతూ విద్యార్థులని చూడకుండా దూషించారన్నారు. టాయిలెట్స్ బాగు చేయించమని పదేపదే చెప్పిన బాగు చేయించడం లేదని అన్నారు. ఇక్కడి విద్యార్థులు మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చినవారని, స్కాలర్షిప్ బేసిక్ మీద అడ్మిషన్ తీసుకున్నారని తెలిపారు. ఎటువంటి ఫీజు కట్టాల్సిన అవసరం లేదని అడ్మిషన్ సమయంలో చెప్పి మధ్యంతరంగా విద్యార్థులను వేధిస్తున్న ప్రిన్సిపల్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మధ్యంతరంగా ఇంగ్లీష్ బోధిస్తున్న అధ్యాపకుడు శ్రీనివాస్‌ను విధుల నుంచి తొలగించారని, సదరు అధ్యాపకుడి ప్రోధ్బలంతోనే అడ్మిషన్ అయ్యామని విద్యార్థులు వాపోయారు. సమస్యలపై ప్రిన్సిపాల్‌ని ప్రశ్నిస్తే తనకు సంబంధం లేదంటూ దాటవేస్తున్నారని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ దిగొచ్చి హామీలని నెరవేరుస్తా అని ఇవ్వడంతో ధర్నాని విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వశాకే సాయికుమార్, జిల్లా కమిటీ సభ్యులు నిలీష్, నాయకులు కార్తీక్, నవీన్, చంద్రమని పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాలు అభివృద్ధి

నవతెలంగాణ-రెబ్బెన

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ జుమ్డి సౌందర్య ఆనంద్ అన్నారు. సోమవారం మండలంలోని తుంగెడ గ్రామంలో బీసీ కాలనీ, బుగుడగూడ, వడ్లగూడలో గడపగడపకు వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి, మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మిని కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరికి బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే లబ్ది చేకూరిందన్నారు. ఇంటింటికి ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ మేనిఫెస్టోలోని అంశాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించి కారు గుర్తుకు ఓటు వేసి ముచ్చటగా మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-లక్షెట్టిపేట



బీఆర్ఎస్‌లో పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం చేరారు. మండలంలోని చందారం గ్రామానికి చెందిన యువకులు 15 మంది బీఆర్ఎస్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ యువ నాయకులు విజిత్ రావు ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా విజిత్ రావు మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తు, మంచికి మారు పేరుగా నిలిచిన దివాకర్‌రావును కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, సర్పంచ్ జయంత్, గ్రామ పెద్దలు చిందం రాజయ్య, రమేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారుల దాడులు

నవతెలంగాణ-దహెగాం

కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని దహెగాం మండలంలో ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో మండలంలోని చౌక గ్రామానికి చెందిన కొలిపాక శ్రీకాంత్ ఇంటిలో తనిఖీ చేయగా అక్రమంగా విక్రయిస్తున్న ఓసీ 180 ఎంఎల్ తొమ్మిది, యునైటెడ్ గోల్డ్ విస్కీ వెయ్యి ఎంఎల్, బీర్లు 10 బాటిళ్ల స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. ఎవరైన గుడుంబా తయారుచేసిన, అక్రమంగా మద్యం తరలించిన అమ్మిన చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కిషన్ పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ సాగుపై దృష్టిసారించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని కృషి విజ్ఞానకేంద్రం బెల్లంపల్లి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ అన్నారు. మండలంలోని చెడ్వాయి రైతువేదికలో జన్ జాతీయ గౌరవ దివస్‌లో భాగంగా రైతు సంఘాలతో ఏర్పాటుచేసిన సమావేశంలో సహజ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యాసంగిలో ఆరుతాడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని, ఉద్యానవన పంటలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తేలిక భూముల్లో పత్తి సాగు చేసే రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేపట్టాలని, తద్వారా గులాబిరంగు పురుగు ఉధృతిని నియంత్రణలో ఉంచవచ్చని, దానివల్ల అధిక దిగుబడులు సాధించే అవకాశ ముందన్నారు. వరి, పత్తి, మొక్కజొన్న, మిరప పంటలో చీడపీడల నివారణపై, వాటి ఆజామాన్యంపై అవగాహన కల్పించి పంట మార్పిడి చేపట్టాలని, పచ్చిరొట్ట పంటల సాగుపై దృష్టిసారించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పంటల్లో వస్తున్న చీడపీడల నివారణకు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకొని రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా పెట్టుబడిని తగ్గించుకొని, దిగుబడిని పొంది ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజుల నాయుడు, ఉద్యానవన అధికారిని శాంతిప్రియ, సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రతినిధి యాదవరెడ్డి, షణ్ముక అగ్రిగేట్ మేనేజర్ స్వామి, ఏఈఓలు గోసియా, శ్రీవిద్య, లావణ్య, రైతులు పాల్గొన్నారు.

'మాలీలను పట్టించుకోకపోతే పుట్టగతులుండవు'

నవతెలంగాణ-కెరమెరి



కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ మాలి ప్రజల సమస్యల పట్ల మాట్లాడకపోవడం మాలీలను అవమానపరిచినట్లేనని మాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోసే శంకర్, పటేళ్ల సంఘం అధ్యక్షుడు సండే నారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాలీలను పట్టించుకోని రాజకీయ పార్టీలకు పుట్టగతులు ఉండవన్నారు. మాలీ కులస్తుల సమస్యల పట్ల అవగాహన పెంచుకొని వాళ్ల డిమాండ్లను పరిష్కరించే పార్టీకే మాలి కులస్తులు ఆదరిస్తారని తెలిపారు. మాలీలను పక్కన పెట్టె పార్టీలకు ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మద్దతు ఇచ్చేది లేదన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు మాలి సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీల తరపున వినతి పత్రాలు అందిస్తున్నామని, కానీ కొంతమంది అభ్యర్థులు 30 వేల ఓటర్లు కలిగి ఉన్న మాలి కులస్తులను పక్కనపెట్టి వారి సమస్యలపై ఏమాత్రం స్పందించకుండ అధినాయకులతో చర్చించకుండా, కేవలం సమావేశాలు విజయవంతానికి మాత్రమే మాలి కులస్తులను వాడుకుంటున్నారని విమర్శించారు. భవిష్యత్తులో వాళ్ల ప్రవర్తన ఇలాగే ఉంటే మాలిలు గమనించి రాబోయే ఎన్నికల్లో వాళ్లకు బుద్ధి చెబుతారని అన్నారు. ఇకనైనా అన్ని రాజకీయ పార్టీలు మాలికులస్తులకు ఎస్టీ హోదాతోపాటు మిగతా సమస్యలపై అధిష్టానాలు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి లేన్గూరేబాలాజీ, సకారాం, శివరాం, శంకర్ పాల్గొన్నారు.

కన్నర్‌గావ్ గ్రామంలో ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కన్నర్‌గావ్, దుబ్బగూడ, కమాన గ్రామాల్లో జడ్పీటీసీ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు చేన్లలో పనిచేస్తున్న మహిళల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ అభివృద్ధి పథకాలు, మేనిఫెస్టోలని అంశాలను వివరిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ పెంటు, సర్పంచ్ బండె తుకారాం, ఎంపీటీసీ ప్రవీన్, డాబా సర్పంచ్ జంగు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన జువ్వాడి రాజలింగు(45) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. 2 రోజుల క్రితం ఈయన ఇంటి నుంచి బయటకు వెళ్లిపోగా కుటుంబీకులు ఆయన కోసం వెతుకుతున్నారు. సోమవారం తెల్లవారుజామున రాజలింగు మృతదేహం గ్రామ సమీపాన ఉన్న బావిలో తేలడంతో, చుట్టుపక్కల వారు అమృతదేహాన్ని చూసి, వారి కుటుంబీలకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. రాజలింగు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి సతీష్ తెలిపారు.

టీజేఎస్ అనుబంధ సంఘంలో చేరికలు



నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ జన సమితి అనుబంధ సంఘమైన తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘంలో నస్పూర్‌కు చెందిన తెలంగాణ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మిన లింగన్న, ప్రధాన కార్యదర్శి రామగిరి శ్రీనివాస్‌లు చేరారు. వారిని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ నేత కోదండరాం, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లింగన్న, శ్రీనివాసులు మాట్లాడుతూ అనుబంధ సంఘంగా కొనసాగుతామని, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వాలు కాంట్రాక్టు కార్మికులను గత పది సంవత్సరాలుగా చిన్నచూపు చూస్తున్నాయని, వారికి రావలసిన హక్కులను, జీతభత్యాల గురించి పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని, కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని కోదండరాముని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జైపాల్ సింగ్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల పక్షాన సీఐటీయూ ఎనలేని పోరాటం

నవతెలంగాణ-నస్పూర్

కాంట్రాక్ట్ కార్మికుల పక్షాన సీఐటీయూ రాజీలేని పోరాటాలు చేస్తుందని ఎస్సీకేఎస్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని సీఐటీయూ కార్యాలయంలో కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఓల్వా డ్రైవర్లు, డంపర్ ఆపరేటర్లు యూనియన్ లోకి చేరారు. వారికి దూలం శ్రీనివాస్, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వేల్పుల కుమారి, గట్టు మహేందర్ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఓబీలలో పనిచేస్తున్న వివిధ విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు సరైన వేతనాలు లేక, కనీస సౌకర్యాలు అమలు కాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం విడుదల చేసిన సర్క్యూలర్ల ప్రకారం కాంటాక్ట్ కార్మికులకు రావాల్సిన వేతనాలు రావడంలేదని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను తెచ్చుకోవడంలో ఓబీలు ప్రధాన పాత్రను పోషిస్తున్నాయని విమర్శించారు. సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న ఓబీ కార్మికులంతా ఒకటే ముఖ్యంగా పోరాటాలు చేస్తే తప్ప కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితులు మారవని, హక్కులు రావని తెలిపారు. రాబోయే రోజుల్లో కార్మికులంతా ఐక్యంగా ఉంటే కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) గా పోరాటాలు చేసి హక్కులు సాధిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామకష్టాపూర్ ఏరియా అధ్యక్షుడు పెద్ద లచ్చన్న,రాజేష్, తిరుపతి, శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సీకేఎస్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్

బీఆర్‌ఎస్‌తోనే ముస్లిం మైనారిటీల అభివృద్ధి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ముస్లిం మైనారిటీల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని బీఆర్‌ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా లక్షెట్టిపేట పట్టణంలో మైనార్టీ సోదరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమాభివృద్ధిని అలాగే బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించినరు. ముస్లిం మైనారిటీలకు షాది ముబారక్ పథకం ద్వారా రూ.లక్ష అందించిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. అదేవిధంగా విద్య రంగంలో కూడా మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కృషి



చేస్తున్నారని తెలిపారు. ఎన్నో రంగాల్లో అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. నవంబరు 30వ తేదీన జరిగే ఎన్నికల్లో కారు గుర్తును ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ సజ్జు, కట్ల చంద్రయ్య, నాయిమ్, వజీర్ అలీ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ట్రస్మా పూర్తి మద్దతు

నవతెలంగాణ-జన్నారం

ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ట్రస్మా పూర్తి మద్దతు ఇస్తుందని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని కలమడుగులో విలేకరులతో మాట్లాడుతూ ప్రయివేట్ ఉపాధ్యాయులకు రూ.10 లక్షల ఇన్సురెన్సుకు, వివిధ సమస్యల పరిష్కారానికి పార్టీ హామి ఇచ్చినందున మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఖానాపూర్ నియోజక వర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపుకు ట్రస్మా తరుపున తమ వంతుగా కృషి చేస్తామన్నారు. నియోజక వర్గం వ్యాప్తంగా ప్రయివేటు ఉపాధ్యాయులు, కరస్పాండెంట్లను కలిసి పార్టీ గెలుపుకు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో 65 ప్రయివేటు పాఠశాలలున్నాయని, వెయ్యికిపైగా ఉపాధ్యాయులున్నారని అందరికి కలిసి వినతి చేయడం జరిగిందన్నారు. కలమడుగు గ్రామ నివాసిగా, జాన్సన్ నాయక్‌కు మద్దతు. తెలుపడం జరిగిందన్నారు. అభివృద్ధిలో వెనుకబడి పోయిన ఖానాపూర్ నియోజక వర్గాన్ని కేటీఆర్ స్నేహితునిగా అభివృద్ధి పథంలో ఉంచాలని కోరారు. జాన్సన్ నాయక్ గెలిస్తేనే నియోజకవర్గం అభివృద్ధి జరిగే అవకాశం ఉన్నందున అందరు మద్దతు తెలిపి జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కోరారు.

మండలంలో జోరుగా కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలో కాంగ్రెస్ ప్రచారం జోరుగా సాగుతోంది. సోమవారం మండలంలోని గూడెం, నంబాల, వెలగనూరు, కాసిపేట్, రంగంపల్లి, కన్నెపల్లి గ్రామాల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా పలువురు కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి కోకిరాల పప్రేమ్ సాగర్ రావ్ వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ప్రజలను కోరారు. గత పాలకుల మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని అన్నారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధితోపాటు నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. పార్టీ ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీల పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని అన్నారు. ఇచ్చిన హామీలను గత పాలకులు ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఎన్నికలు రాగానే



హడావిడి చేస్తూ ప్రజలను మభ్యపెట్టి ప్రయత్నం చేశారని ఆయన విమర్శించారు. పది సంవత్సరాల పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ అప్పుల తెలంగాణ అయిందని ఆయన విమర్శించారు. ప్రజలు ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఎన్నికల మేనిఫెస్టోను గ్రామాల్లో ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలను గుండెల్లో పెట్టి చూసుకుంటానని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

బడుగు బలహీన వర్గాలకు ధైర్యం బీఆర్ఎస్



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

బడుగు బలహీరన వర్గాలకు బీఆర్ఎస్ ధైర్యమని, అందుకే పార్టీలో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం ఆయన సమక్షంలో ఏసీ మెకానిక్, పాన్ షాప్ అసోసియేషన్ సభ్యులు పార్టీలో చేరారు. ఓ ప్రైవేట్ ఫంక్షన్లో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వారికి గులాబి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ అదాని, అంబానీలకు కొమ్ము కాస్తున్న బీజేపీని పేద ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్ బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నారని గుర్తుచేశారు. మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, పట్టణ కార్యదర్శి అశ్రఫ్, యూనిస్ అక్బాని, కో ఆప్షన్ సభ్యులు ఏజాజ్ అహ్మద్, ఏసీ మేకానిక్, పాన్‌షాప్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సిరికొండను ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతా..

- బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్



ప్రచారంలో భాగంగా వృద్దురాలితో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్

నవతెలంగాణ-సిరికొండ

సిరికొండను ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం రోడ్‌షో నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఇంటికి తాగునీరు, ప్రతి ఎకరానికి సాగు నీరు అందిస్తూ, రైతులకు 24 గంటల కరెంట్‌ను ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్సేనని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించి, రైతులను ఆదుకుంటోందని అన్నారు. బోథ్ నియోజకవర్గ యువత భవిష్యత్తుకు నాదే బాధ్యతని అన్నారు. ఆశీర్వదించి అసెంబ్లీకి పంపిస్తే మండలంలో చిక్మాన్ ప్రాజెక్ట్ రీడిజైన్ చేస్తామని, డబుల్ రోడ్ నిర్మాణం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పెంటన్న, ఇక్బాల్, చందు, నర్సయ్య, గొర్ల రాజన్న, రోహిదాస్, లక్ష్మణ్, బియ్యాల మల్లేష్ పాల్గొన్నారు.

జల్ జంగల్ జమీన్‌పై హక్కులేవి...?

- కుమురం భీం విగ్రహావిష్కరణలో భీం మనవడు
- ఘనంగా భీం వర్ధంతి వేడుకలు



భీం వర్ధంతిలో భీం మనవడితో కలిసి మాట్లాడుతున్న తుడుం దెబ్బ అధ్యక్షుడు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

జల్ జంగల్ జమీన్ కోసం పోరాడి కుమురం భీం అమరుడై 83 ఎండ్లు అవుతున్న నేటికి ఆదివాసులకు వాటిపై హక్కులు కల్పించడం లేదని కుమురం భీం మనవడు కుమురం సోనేరావ్, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ అన్నారు. సోమవారం అమరవీరుడు కుమురం భీం 83వ వర్ధంతిని పురస్కరించుకోని మండలంలోని యాపల్‌గూడలో నూతన విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు చేస్తూ గ్రామంలో నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాన్ని ఆవిష్కరించారు. యాపల్‌గూడతో పాటు బుర్నూర్, మత్తడి గూడ, రాములగూడ, కొత్తగూడ గ్రామాల్లో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశానికి స్వతంత్రం వచ్చి 75 ఏండ్లు గడుస్తున్న నేటి ఆదివాసుల బ్రతుకులో మాత్రం ఎలాంటి మార్పు లేదన్నారు. జల్ జంగల్ జమీన్, స్వేచ్ఛ, సమానత్వం, స్వయం పరిపాలన కోసం పోరాడి భీం అమరుడై నేటికి 83 ఏండ్లు అవుతున్న ఆదివాసులకు జల్, జంగల్, జమీన్‌పై హక్కులు కల్పించబడాలేదన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలు, హక్కులు, జీఓలు కూడా ఉల్లంఘించి, ఆదివాసుల సంస్కృతి, సంప్రదాయలను కాలరాస్తున్నారన్నారు. ఐక్యంగా ఉంటు హక్కుల సాధన కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. తమను గుర్తించని ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని, గ్రామాల్లో వచ్చే నాయకును నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పటేళ్లు కుంర శ్యాంరావు, వెట్టి మనోజ్, కొడప నారాయణ పటేల్, కుమ్ర మారుతి పటేల్, కుమ్ర ముకుంద్ రావు పటేల్, ఆనక పరశురాం పటేల్, మడావి జంగు పటేల్, తొడసం సురేష్ పటేల్, ఆత్రం భూజంగ్‌రావ్, పెందూర్ గంగారాం, దుర్వా రామచందర్, కోడప లింగు, కుమ్ర సంతోష్, సోయం లక్ష్మణ్, ఆనక గంగారాం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే మరోమారు గెలిపిస్తాయి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-బేల

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు మోసపూరిత వాగ్దనాలతో ప్రచారం చేస్తున్నారని, బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలే తమను మరోమారు గెలిపిస్తాయని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని జునోని, కరోని, తెలంగ్‌రావ్ గూడలో విస్తృతంగా పర్యటించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే జోగు రామన్నకు మంగళహారతులతో డప్పు చప్పుల మధ్య ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ సంక్షేమం అందించకుండా 72 ఏండ్లు పాలించిన బీజేపీ, కాంగ్రెస్ ఏ ముఖం పెట్టుకొని గ్రామాల్లో ఓట్లు అడగడానికి వస్తారని మండిపడ్డారు. మండల అభివృద్ధిలో భాగంగా ఆదిలాబాద్ నుండి బేల వరకు రోడ్డు సౌకర్యం కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చించామన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు రైతుల పట్ల అమానుషంగా ప్రవర్తించరని, సీఎం కేసీఆర్ రైతాంగంతో పాటు వారి కుటుంబాలకు అండగా నిలుస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. మూడోసారి కూడా ప్రజలు ఆశీర్వాదించి కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మెన్ రౌతు మనోహర్, మండల అధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, సతీష్ పవార్, జక్కుల మధుకర్, దేవన్న, గంభీర్ ఠాక్రె, ఇంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తే బీఆర్ఎస్‌కు అమ్ముడు పోతారు

- రోడ్ షోలో పాల్గొన్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



రోడ్‌షోలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒకటేనని కాంగ్రెస్ పార్టీ వ్యక్తులు గెలిస్తే తిరిగి కేసీఆర్‌కు అమ్ముడు పోతారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. జిల్లాకు జోగు రామన్న చేసిందేమి లేదని అన్నారు. ఆదిలాబాద్‌లో మున్సిపల్ చైర్మెన్ కంటే వైస్ చైర్మెన్ రాజ్యం నడుస్తుందని అన్నారు. ఈ ఎన్నికల్లో మళ్లీ జోగు రామన్నను గెలిపిస్తే వైస్ చైర్మెన్, మున్సిపల్ చైర్మెన్ అవుతాడంటూ వ్యాఖ్యలు చేశారు. జోగు రామన్న ఆదిలాబాద్‌కు చేసిన అభివృద్ధి ఏంటని ప్రశ్నించారు. ఆదిలాబాద్ అభివృద్ధి చెందుతుందంటే కేంద్రం నిధులే అని, పాయల్ శంకర్, సుహాసినిరెడ్డి ఎన్నో సార్లు కేంద్ర మంత్రులను కలిసి విన్నవిస్తేనే కోట్ల రూపాయలు వచ్చాయని అన్నారు. కేంద్రం పెద్ద ఎత్తున ఆదిలాబాద్ జిల్లాకు నిధులిస్తుంటే కేసీఆర్ ప్రభుత్వం మాత్రం వాటిని దారి మళ్లిస్తోందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని అన్నారు. 50వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన చనాక కొరాట ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా సాత్నాల ప్రాజెక్ట్‌పై చెక్ డ్యామ్‌లను నిర్మించడంలో కూడా విఫలమైందన్నారు. పోరాడేవాళ్లకు ఓట్లేసి గెలిపించకపోతే భవిష్యత్తులో ఏ పార్టీ కూడా పేదల పక్షాన కొట్లాడే అవకాశమే లేదన్నారు. కులాల పేరుతో రాజకీయం చేసి ఓట్లు దండుకుని ఆ కులాలను మోసం చేసిన చరిత్ర కేసీఆర్‌దేనని అన్నారు. తెలంగాణలోని బీసీలన్నీ బీజేపీకే ఓటేయబోతున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తే సీఎం కాబోతున్నారని మాట్లాడారు. అనంతరం పాయల్ శంకర్ మాట్లాడుతూ జోగు రామన్న నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలను మోసం చేశారని అన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే జిల్లాకు ఎయిర్ పోర్ట్ ఏర్పాటు చేసి వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

ఇంద్రవెల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్ విస్తృత ప్రచారం



ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలో సోమవారం వారాంత సంతలో బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్, కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. మారుమూల గ్రామాలు దేవాపూర్, ధనోర-బితో పాటు మండల కేంద్రంలో ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు వాల్గొండ, వడగావ్, అంజి, దస్నాపూర్, హర్కాపూర్ ఆదివాసీ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. అటూ బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్ ఇస్త్రీ, హోటల్‌లో బజ్జీలు వేస్తూ ఓటర్లను కలిసి కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. వారితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కాంగ్రెస్‌లో ఉప సర్పంచుల చేరిక

నవతెలంగాణ-కాసిపేట

పెద్దనపల్లి సర్పంచ్ వేముల కృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో సోమవారం పలువురు బీఆర్ఎస్‌కు చెందిన ఉపసర్పంచ్లు చేరారు. ఈ సందర్భంగా వీరికి మాజీ మంత్రి గడ్డం వినోద్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. చేరినవారిలో లంబాడితండా(కె) ఉప సర్పంచ్, జర్పుల తిరుమల్, మామిడిగూడెం ఉప సర్పంచ్ నగావత్ భాస్కర్, పల్లంగుడా ఉప సర్పంచ్ రంగు సతీష్, లంబాడితండా ఉప సర్పంచ్ రాజేష్లు ఉన్నారు. ఈ సందర్భంగా గడ్డం వినోద్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పార్వతి మల్లేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కనుకుల రాకేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న అగ్గి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కాసిపేట మేజర్ గ్రామ పంచాయతీ 8వ వార్డు మెంబర్, బీఆర్ఎస్ బీసీ సెల్ మండల మాజీ అధ్యక్షులు, బెల్లంపల్లి లిఫ్ట్ మిల్లర్ సంఘం అధ్యక్షుడు, బీఆర్ఎస్ నేత అగ్గి వెంకటేశ్వర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు.

భక్తులకు చుక్కలే

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూర్(టి) మండలంలోని టోంకిని సిద్ది హనుమాన్ దేవాలయానికి మంగళవారం నిర్వహించే పాదయాత్ర భక్తులకు పగలే చుక్కలు కనిపించనున్నాయి. సిద్ది టోంకిని హనుమాన్ పాదయాత్రను ప్రతీ ఏటా ఆలయ కమిటీ నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా మంగళవారం 22వ మహా పాదయాత్రను నిర్వహించనున్నారు. ఈ పాదయాత్ర కాగజ్‌నగర్ నుండి టోంకిని వరకు సుమారు 23 కిలో మీటర్లు కొనసాగుతుంది. వేలాది మంది భక్తులు ఈ పాదయాత్రలో పాల్గొంటారు. కాళ్లకు చెప్పులు లేకుండా భక్తులు కాలి నడకన ఈ ఆలయానికి చేరుకుంటారు. కాగజ్‌నగర్ నుండి సిర్పూర్ వరకు మధ్యలో రోడ్ చెడిపోయి కంకర తేలి ఉంది. ఈ కంకర మీద పాదయాత్ర చేయడం భక్తులకు గగనమే. పాదయాత్రను దృష్టిలో ఉంచుకొని రోడ్ మరమ్మతులు చేయకపోవడం పట్ల భక్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

నగదు పట్టివేత

నవతెలంగాణ - సిర్పూర్(టి)

ఈ నెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పోలీసులు మండలంలో వాహనాల తనిఖీ ముమ్మరంగా నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు. సోమవారం వాహనాల తనిఖీలో భాగంగా సిర్పూర్ గ్రామ శివారులో ఉన్న రైస్‌మిల్లు వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా మంచిర్యాల జిల్లా వేమనపల్లికి చెందిన రాజశేఖర్ మహారాష్ట్ర నుండి బొలెరో వాహనంలో రూ.1.64 లక్షలు తరలిస్తుండగా పట్టుకున్నారు. వాటికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా నగదును, మద్యాన్ని తరలిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

అభివృద్ధి చేశాం..మరో అవకాశం ఇవ్వండి

నవతెలంగాణ-దండేపల్లి

రాష్ట్రంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పాటు పడిందని రాబోయే ఎన్నికల్లో మరో అవకాశమిచ్చి ఆశీర్వదించాలని మంచిర్యాల ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి నడిపల్లి దివాకర్ రావు ప్రజలను కోరారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివాకర్ రావు పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. గతంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చమని నూతనంగా ప్రజల సంక్షేమానికి ప్రవేశపెట్టామని అన్ని వర్గాలకు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పక్షాన ఉన్నారని రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మేనిఫెస్టోను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని గ్రౌవపల్లి పంచాయతీలోని సాలెగూడెం, గట్రావ్‌పల్లి, పెద్దపూర్‌కు చెందిన 100 మంది యువత, మహిళలు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బొల్లు రమణారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మద్దిమడ సర్పంచ్ ఆడే జంగు, బీఆర్ఎస్ గట్రావ్‌పల్లి, సోనాపూర్ గ్రామ అధ్యక్షులు పెంద్రం ప్రభాకర్, పెంద్రం సింగు, ఉప సర్పంచ్ మోతీరామ్, నాయకులు సిడాం గణపతి, పెంద్రం హన్మంతు, ఆత్రం మహేష్, దందవేణి చందు, వెంకటేష్ గ్రామ పటేళ్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మధ్యాహ్న భోజన పథకం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని విద్యాభారతి స్కూల్‌లో అధ్యక్షులు కొట్రంగి శారద అధ్యక్షతన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పదిహేను మండలాల పరిధిలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కొంత మంది ఓర్వలేక కార్మికులను అడ్డం పెట్టుకొని రాజకీయంగా ఆర్థికంగా ఎదగడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కార్మికులంతా సీఐటీయూ సంఘంగా ఏర్పడి విజయాలు సాధించారని, అలాంటి సంఘం, నాయకులపై తప్పుడు ప్రచారాలు చేస్తూ ద్రోహాన్ని తలపెడుతున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో అలాంటి వారికి సరైన బుద్ధి చెబుతామన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన అల్పాహారం నిర్వహణపై అతితక్కువ బడ్జెట్ చెల్లిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం కమిటీని ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా కొట్రంగి శారదా, గౌరవ అధ్యక్షులుగా వెలిశాల క్రిష్ణమాచారి, కార్యదర్శిగా పాగిడి మాయ, కోశాధికారిగా రూపతో పాటు పదహారు మంది సభ్యులను ఎనున్నట్టు వారు తెలిపారు.

గుండె సంబంధిత వ్యాధిపై అవగాహన

నవతెలంగాణ-నస్పూర్

గుండె సంబంధిత వ్యాధుల నివారణపై సోమవారం ఆర్కే-7 గనిలో రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు గని మేనేజర్ సాయిప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకనాథ్‌రెడ్డి, సాయి ప్రసాద్ మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధుల లక్షణాలను తెలిపి, నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో రక్షణాధికారి రవిశంకర్, అండర్ మేనేజర్లు రవీందర్, వెంకట్ రాము, లక్ష్మణ్, శశాంక్, గని ఇంజనీర్లు సుధీర్‌రెడ్డి, రమేష్, వెంటిలేషన్ అధికారి జగదీశ్వర్ రావు, సంక్షేమ అధికారి సంతన్ పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు



నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రభుత్వం ఏర్పాటుతోనే అమలులోకి వస్తాయని చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి ముదిగుంట, కానుకూరు, నర్వ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ఓటర్లను ఉద్దేశించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, రేషన్‌కార్డులు, రైతు రుణమాఫీ అమలు చేయకపోవడం బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో కలిగే ప్రయోజనాలను వెల్లడించారు. ఈ ఆరు గ్యారంటీ పథకాలతో పాటు ఎన్నికల మ్యానిఫెస్టో ద్వారా వెల్లడించిన సంక్షేమ పథకాలు తెలంగాణ ప్రజలను ఆకట్టుకున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి చెన్నూర్ నియోజకవర్గంలో కనీస వసతులు కల్పించకపోగా సొంతంగా సంపాదించుకోవడానికే పదవిలో కొనసాగారని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా తనను గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, ప్రజలకు అందుబాటులో లేనటువంటి నాయకులను పట్టించుకోవల్సిన అవసరం లేదని అన్నారు. నర్వ గ్రామాన్ని దత్తతగా తీసుకుంటున్నట్టు వెల్లడించారు. సింగరేణి ఎస్టీపీపీలో స్థానికులకు ఉద్యోగాలు ఇప్పించనున్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

సీఓఈలో బాలల హక్కుల దినోత్సవం

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి(సిఓఈ)లో సోమవారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఐనాల సైదులు విద్యార్థులను, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను ప్రపంచవ్యాప్తంగా 1989లో గుర్తించిందన్నారు. దానికి అనుగుణంగా 1992 నుండి భారత ప్రభుత్వం నవంబర్ 20న బాలల హక్కుల దినోత్సవంగా నిర్వహిస్తోందన్నారు. అనంతరం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా కళాశాల గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె. రాజ్ కుమార్, జేపీ కొక్కుల రాజేశ్వర్, లైబ్రేరియన్ ఎండి కౌసర్, ఉపాధ్యాయులు వరమని ప్రమోద్ కుమార్, షిండే దత్త ప్రసాద్, పొన్నం శ్రీనివాస్, పొన్నాల రాజ్‌కుమార్, శ్యాంసుందర్ రాజు, హారిక, స్రవంతి, శ్యామల పాల్గొన్నారు.

అనారోగ్యంతో చింతగూడ జీపీ కార్యదర్శి మృతి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న గుర్రపు రాజేశ్వరి అనారోగ్యంతో మృతి చెందారు. రాజేశ్వరి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చేర్పించారు. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో రాజేశ్వరి సోమవారం ఉదయం మృతి చెందారని తెలిపారు. రాజేశ్వరి మృతిపై అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

యువకులు సామాజిక సేవకు కంకణబద్ధులు కావాలి

నవతెలంగాణ-జైపూర్

యువకులు చెడు అలవాట్లకు దూరంగా సామాజిక సేవా కార్యక్రమాలకు సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు తుంగపిండి సాయి మాదిగ అన్నారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం సహచరులతో కలిసి రక్తదానం చేశారు. రక్తదానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణాలను కాపాడినట్టు అవుతుందని పేర్కొన్నారు. గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సన్మార్గాలను అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామారావుపేట్ సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ నామాల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు తుంగపిండి మల్లేష్, వార్డు సభ్యులు గోలి వెంకటేష్, చిప్పకుర్తి వెంకటేష్, అభి, సాయి కిరణ్, శ్రీకాంత్, సాయి, తేజ, బిట్టు శ్రీకాంత్ పాల్గొన్నారు.

కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలి

నవతెలంగాణ - చింతలమానేపల్లి

రణవెల్లి గ్రామంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప రణవెల్లి, గంగాపూర్, కోర్సిని గ్రామస్తులకు గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని రణవెల్లి, గంగాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బులు నానయ్య, జడ్పీటీసి డుబ్బుల శ్రీదేవి, బీఆర్ఎస్ నాయకులు వెంకన్న పాల్గొన్నారు.

సీఐ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు

నవతెలంగాణ - కాసిపేట

చొప్పరిపల్లి సమీపంలో పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద మందమర్రి సీఐ మహేందర్ ఆధ్వర్యంలో ఎస్ఎస్టీ బృందం, ఎఫ్ కంపెనీ 213 సీఆర్పీఎఫ్ మహిళా బెటాలియన్ ఫోర్స్‌తో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. అటుగా వెళ్తున్న వాహనాలను, వాహనాల్లో ఉన్న సామాగ్రిని పరిశీలించారు. ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సీఐ మహేందర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్టీ బృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. సోమవారం విశ్రాంత ఉద్యోగ సంఘ భవనంలో జిల్లా అధ్యక్షుడు గర్రెపల్లి కరుణాగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థికి మద్దతు తెలపాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు కరుణగౌడ్ మాట్లాడుతూ ప్రతి నెల పెన్షన్ ఒకటవ తేదీన వచ్చే విధంగా, పెండింగ్‌లో ఉన్న డీఏ, డీఆర్ విడుదల చేసేలా చూడాలని విన్నవించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సదానందం, ఆసిఫాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, మధుసూదన గౌడ్, కార్యవర్గ సభ్యులు అచ్యుత్ రావు, కిష్టయ్య, కనకమ్మ, అమలామేరీ, జోస్ఫిన్, లింగయ్య, మల్లమ్మ, సుభాష్ సింగ్, పెంటయ్య, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ భారీ ర్యాలీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం నుండి భారీ ఎత్తున యువకులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. కోవ లక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఉత్సాహంగా యువత ర్యాలీలో పాల్గొన్నారు. కుమురం భీం చౌక్, అంబేద్కర్ చౌక్, వివేకానంద చౌక్, గాంధీ చౌక్ మీదుగా ప్రధాన వీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోవా సాయినాథ్, కార్తీక్, సిద్దు, సాయి శ్రావణ్, సాయిరాం, అహ్మద్, సల్మాన్ పాల్గొన్నారు.